వంటింటి లెక్చర్లు (౮)

# ఎన్నికలలో.....

వెంకన్న అలా చెప్తూంటే— ముగ్గురు వనితలు చేతుల్లో చెంబుల్తో వయ్యారంగా నడచి వస్తున్నారు ఎన్నికల గురించి మాట్లాడుతూ. వాళ్ళు ముగ్గురూ మాసిన చీరలతో రేగిన తలలతో ఏళ్ళతరబడి స్నానాలు చేయని వాళ్ళలాగున్నారు. వారి వారి నిజభర్తలు ముద్దు చేసినపుడు ముద్దుచేసి తగిల్నివ్వాల్సొచ్చినపుడు నాలుగు తగల్నిచ్చి, తాము పోషించినా పోషించక పోయినా "తమ ఆడవాళ్ళు"గా మాత్రం చెప్పుకొంటూవుంటారు. ఈ ఆడవాళ్ళు తమ పొట్టలు తాము పోసుకుంటూ — మొగుళ్ళ గురించి, సినిమాల గురించి, లోకం గురించి చెంబు తీసుకుని మార్నింగ్‌వాక్‌కి వెల్తూ వస్తూ ముచ్చటించుకుంటూ వుంటారు. రాత్రిళ్ళు బెజవాడలో ఏ వీధిలో ప్రవేశించినా చీకట్లో కొరివి దెయ్యాల్లా వాళ్ళు చెంబుల్తో సహా లేచి కూర్చుంటారు. వీళ్లు సీరియల్నవల్లు చదవలేరు. వాళ్ళకి కాంప్లెక్సు ల్లేవు. మిడిల్‌క్లాసు ఆడదానికి లేని ఆర్థిక స్వాతంత్ర్యం వుంది వీళ్ళకు- పిల్లల్ని పెంచటం వండి వార్చటమేగాక చిన్న చిన్న సైడు బిజినెస్సులు కూడా చేస్తారు. వీళ్ళకి సోషల్ ఇన్‌బిహిషన్లు వుండవు. అంచేత మనవాళ్ళంతా వీరిని అలాగా జనం అంటారు. పిళ్లు విసుర్తారు, కోతలకు పోతారు, కూలీ నాలీ చేస్తారు, రాళ్ళనుకొట్టి నీళ్లు మోసీ రెండూ మూడూ నాల్రూపాల్దాకా సంపాదించగల్రు. నోరెట్టుకు పోట్లాడగల్రు—జీవితం అంటే వీరిదే - కాని

ఈ జీవితం మిడిల్ క్లాసు వాళ్ళకు పనికిరాదు. కవులకీ కళాకారులకీ సినిమా వారికీ వీరి జీవితంలోంచి చెప్పడానికేమీ వుండదు. సొంత పాకీదొడ్లే లేని ఆడవాళ్ళ జీవితాలు ఆర్టుకి పనికిరావు.

చెంబులుచ్చుకు పోతున్నారని చెప్పాను గదా - ఎన్నికల గురించి మాట్లాడుకుంటున్నారు. అందులో ఒకామె అంటున్నది. "మునుపు రెండే పార్టీలు సుత్తీ కొడవలీ, మూడు రంగుల జండా" మరొకత్తి వూగొట్టింది చెంబులో మిగిలిన నీళ్ళని రోడ్డుమీద ఒంపేసి —

"మరి త్రాసు. సైకిలూ, కడవా, నాగలి, గుర్రం యీటిమా టేమిటి?"

"ఇయన్నీ యిప్పుడొచ్చినయే గాని మనదేశంలో రెండే రెండుం డేయ్-సుత్తీ - కొడవలీ, మూడు రంగుల జండా - మిగతాయన్నీ తుక్కే-ఎలచ్చన్లప్ముందొచ్చి మల్లీ తరువాత్తరువాత అపడవు" ఈ చిల్లరమల్లర పార్టీలు. ఇండిపెండెంట్లు ప్రజలకు చేసేదేమీలేదని చెంబట్టుకు వెళ్తున్న వారికి కూడా తెలుసు. ఈ దేశంలో ఇన్ని పార్టీలుండకూడదని వారి అభి ప్రాయం. వాళ్ళకు జాతీయ పతాకానికి, కాంగ్రెసు జండాకి వున్న తేడా తెలీదు. ఇలాంటి ప్రజలుంటారనే మన నెహ్రూగారు కాంగ్రెసు జండాలో రాట్నం పీకిపారేసి చక్రం పెట్టారు. ఆ జండా ఈ జండా ఒకటే అనే భావం కలిగేలా జాతీయ పతాకాన్ని రూపొందించకుండా వుండ వలసింది.

మా పనిమనిషి ఓటేసొచ్చింది. ఏవే ఎవరికేశావని అడిగా—మనం మనం లేడీస్‌గదా ఇందిరాగాంధీకే అనగా ఆవుదూడకే వేసుకుంటుందని అనుకుంటూ అది చెప్పింది. మునుపటిసుట్టు పదిరూపాయలుచ్చుకేసిందట-మరి ఇప్పుడో-

"ఇప్పుడు మావోడే మరిగ మనం మనం ఒకే కులపోళ్ళం గదా ఏసెయ్యమన్నాడు-ఏశా"నంది.

"అమ్మ తల్లీ — ఇందిరాగాంధీ కొంప ముంచావే అనుకున్నా. నన్నడిగినా ఆవూ దూడకు వేయమని చెప్పేదాన్ని" అన్నా. "ఎందుకమ్మా

మిమ్మల్నీ మిమ్మల్నీ అడగటం - కులపోడికి యిస్తే తప్పేటవుద్ది?" అంది. అప్పుడు నాకు బోధ పడింది. మన దేశంలో ఇందిరా వచనం లేదూ ఏమీ లేదు. డబ్బుగాలీ, కులంగాలీ రెండే వున్నాయి. ఒకమాటు ఎన్నికల్లో డబ్బు గాలి వీస్తే, మరొకమారు కులంగాలి వీస్తూంటుంది.

కులం గాలిని వదిత్తే యిక అన్ని గుర్తులా త్రాసులా, కొడ



వళ్ళూ, రాటాన్నలూ, సైకిళ్ళూ, కడవలూ, ఆవూ దూడలూ అన్నీ అందులో కొట్టుకుపోతాయి. కాంగ్రెసులో కులతత్వం బాగా ప్రచారంలో వుంది. అందువలన సాధించిన అభ్యుదయం సామాన్య ప్రజలకు అందడం లేదని వాపోవటానికి ఈ ఎత్తు ఎత్తివుంటారు మన హైకమాండ్. సోష లిజం తెస్తున్నావన్నారు ఎందాకా వచ్చిందిందిరమ్మగారూ ?

ముందు కులతత్వం పోవాలి. పోతేనే కాని సోషలిజాన్ని అమలు పర్చలేము. నాకు ప్రజల సహాయం లేనిదే ఏం చేయగలను ?

పదవిలో వుండేవాళ్ళకి ప్రజల అజ్ఞానంమీద గేం ఆడటం ఎల్లాగో తెలిశాక వాళ్ళను ఒదుల్చుకోటవం బ్రహ్మతరం కాదు.

ఈ దేశంనిండా మా పనిమనిషిలాటి తత్వం కలవాళ్ళు అనేక మంది వున్నారు. వాళ్ళకు కులతత్వం తెలుసు కాని వర్గస్వభావం తెలియదు. కులంలో గొప్పవాళ్ళు కొద్దివాళ్ళు మళ్ళీ వేరువేరని వారంతా ఒకటి కాజాలరనీ ఒకటావటానికి చరిత్రలో ఎటువంటి ఉదాహరణా లేదని వారికి మాత్రంతెలియదు. రిలిజీయన్, గాడ్, పోలిటిక్స్, పవర్ అంతాకులానికిఅతీతం కానపుడు ఆవు—దూడా మార్క్స్ సోషలిజం క్రిందకు ఎలాగొస్తుందని అడిగితే నోరుమూసి నెత్తిమీద రెండు వాయించి కటకటాల్లోకి తోసెయ్యగల్రు అతితెలివిగా మాట్లాడకు — అని. పాకిస్తాన్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విమోచన, ముజిబ్‌ను విడిపించటం లాటిదికాదు - ప్రజాస్వామ్యంలో పౌరులనే సాంఘిక న్యాయం కూర్చటమంటే — ఇది పైకి కనపడని శక్తులతో పోరాటం .... బ్యాలట్ పెట్టెని పైకితీస్తే అందులోంచి కులం వాసనలు పైకొస్తున్నాయి. ఏ కులంవాళ్లు బాగుపడాలో తేల్చుకుందుకు ఉపయోగపడే ఓటుముక్క సమ సమాజాన్ని స్థాపించడానికి ఈ అప్పలమ్మల అప్పలయ్యల మెజారిటీ వున్న దేశంలో ఉపయోగపడదు.

మీ కులంవాడిని నిలబెట్టాం - మీ పార్టీ గాకపోయినా మీరు ధనసహాయం చేయాలంటే విరాళాలిచ్చే పెద్దలున్నారు, సిద్ధాంతాలు లేవు. గుర్తులు లేవు, పార్టీలు లేవు—అంతా దగా ఉన్నదొకటే—అది మాయ- ఆ మాయా నాటకాన్ని ఆడిస్తున్నది మనీపర్సు. మనీపర్సు సూత్రాలే ఆదేశిక సూత్రాలు. కులతత్వం ఒక శిఖండి - దీన్ని అడ్డుచేసుకొని భీష్ముడంతటి వాడ్ని పడగొట్టొచ్చు. సోషలిజం మాటెత్తితే నోరుముయ్రా రాస్కెల్ అని మూతిమీదకొట్టి పంపించవచ్చు. మరీ లాజికల్‌గా రూల్సు ప్రకారం మాట్లాడితే "నీకు దేశభక్తి లేదురా చవటా" అని తిట్టొచ్చు, అదీ సంగతి.